

సంక్షేమ బడ్జెట్
అన్ని వర్గాలకూ కేటాయింపులు



అసెంబ్లీలో బడ్జెట్ సమర్పిస్తున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

- వచ్చే విద్యా సంవత్సరంలో 'తల్లికి వందనం'
- జిల్లాలో 1.56 లక్షల మంది తల్లులకు లబ్ధి
- మత్స్యకార భరోసా సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంపు
- జిల్లాలో రెండున్నర వేల కుటుంబాలకు ప్రయోజనం
- ఆదరణ పథకం పునరుద్ధరణ


అనకాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం సంక్షేమ రంగానికి అధిక పాధాన్యం ఇస్తూ కేటాయింపులు జరిపింది. పేదల అభివృద్ధే లక్ష్యంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా కేటాయింపులు చేసింది. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేసే విధంగా నిధులు సమకూర్చుకునే ప్రయత్నంలో ఉన్నట్టు వెల్లడించింది. గతంలో వృత్తిపని చేసుకునే వారికి అమలు చేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించింది. హామీల జాబితాలో లేనివి కూడా అందించడానికి ఆసక్తి చూపించింది.

గ్రామీణ నేపథ్యం అధికంగా ఉన్న అనకాపల్లి జిల్లా ప్రజలకు ఈ బడ్జెట్ పలు విధాలా లబ్ధి చేకూరనున్నది. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు జరపడంతో జిల్లాలో రైతులు, మహిళలకు ఆర్థిక ప్రయోజనం కలగనున్నది. వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 2.56 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనున్నది. దారిద్ర్య రేఖకు దిగువున వున్న కుటుంబాల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా రూ.15 వేల చొప్పున అందజేయాడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో 1.56 లక్షల మంది తల్లులకు లబ్ధి చేకూరనుంది. ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా కల్పించేందుకు కేటాయింపులు జరిగాయి. జిల్లాలో 4.5 లక్షల కుటుంబాలకు ఏటా గరిష్ఠంగా రూ.25 లక్షల విలువైన కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందుతాయి.

ఎస్సీ, ఎస్టీ, చేనేత కుటుంబాలకు ప్రతినెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నాయీ బ్రాహ్మణుల హెయిర్ కట్టింగ్ సెలూన్‌లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించనున్నారు. జిల్లాలో ఆయా వర్గాలకు చెందిన సుమారు 45 వేల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కలగనున్నది. సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి సమయంలో (ఏటా ఏప్రిల్ మూడో వారం నుంచి జూన్ రెండో వారం వరకు) చేపల వేటపై నిషేధం అమలులో వుంటుంది. ఈ సమయంలో మత్స్యకారులకు ఎటువంటి ఉపాధి వుండదు. వీరిని ఆర్థికంగా ఆదుకోవడానికి చేపల వేటపై నిషేధ సమయంలో 'మత్స్యకార భరోసా' పథకం కింద ఒక్కో మత్స్యకారునికి రూ.20 వేల చొప్పున చెల్లిస్తారు. గత ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే ఇచ్చేది. కూటమి ... మిగతా 8వ పేజీలో

సర్వతోముఖాభివృద్ధికి దోహదం



రాష్ట్ర బడ్జెట్ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేవిధంగా ఉంది. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయింపులు జరిపి ఎన్నికల హామీలను అమలు చేస్తున్నది. తల్లికి వందనం, రైతులకు పెట్టుబడి నిధుల కేటాయింపులు జరిగాయి. ఆక్వా రైతుల విద్యుత్ వినియోగ చార్జీలు తగ్గనున్నాయి. వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందనున్నాయి. రైతులు, యువత, మహిళల ఆర్థిక వృద్ధే లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారు.

- **పంచకర్ల రమేశ్‌బాబు**, జనసేన ఎమ్మెల్యే, పెందుర్తి

సంక్షేమానికి పెద్దపీట



బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయింపులు జరిగాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి రూ.75 వేల కోట్లు కేటాయించడం గొప్ప విషయం. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరపడం హర్షణీయం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించడంపట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌లో ఇటు సంక్షేమం, అటు అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇచ్చారు.

- **బత్తుల తాతయ్యబాబు**, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

అంకెల గారడీ బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా వుంది. ప్రజలను మోసం చేస్తున్నట్టు ఎక్కడా కనిపించకుండా మేకప్ చేసి రూపొందించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొరగా కేటాయింపులు జరిగాయి. ప్రతి మహిళకు నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నికల హామీలకు పథకాలకు నిధుల కేటాయింపులు జరపలేదు. బడ్జెట్‌లో అప్పుల వివరాలు వెల్లడించలేదు.

- **కరణం ధర్మశ్రీ**, వైసీపీ జిల్లా అధ్యక్షుడు

సాగునీటికి పెద్దపీట

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి బడ్జెట్‌లో రూ.605.74 కోట్లు

- జలాశయాల నిర్వహణ పనులకు నిధులు
- పెద్దేరుకు రూ.2 కోట్లు, రైవాడకు రూ.77 లక్షలు, తాండవకు రూ.48.3 లక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు (ఫైల్ ఫొటో)


అనకాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక నిధులు కేటాయించింది. దీంతో అనకాపల్లి జిల్లాకు కూడా సముచిత రీతిలో నిధుల కేటాయింపు జరిగింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణంతోపాటు ఇప్పటికే అందుబాటులో వున్న పెద్దేరు, కోనాం, రైవాడ, తాండవ జలాశయాల నిర్వహణ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జిల్లాలో సాగునీటి వనరులకు నిధుల కేటాయింపులు బడ్జెట్ పేపర్లకే పరిమితం అయ్యాయి. ఒక్క ఏడాది కూడా నిధులు విడుదల చేయకపోవడంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు అడుగు కూడా ముందుకు సాగలేదు. ఇక పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాల పంట కాలువల ఆధునికీకరణ, తాండవ రిజర్వాయర్ కాలువల్లో పూడికతీత పనులు జరగలేదు. దీంతో ఆయకట్టుకు నీరు సక్రమంగా అందక చివరి భూముల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన 2025-26 పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌లో జిల్లాలో సాగునీటి వనరుల నిర్మాణం, అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది.

సుజల స్రవంతికి రూ.605.74 కోట్లు

బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి బడ్జెట్‌లో రూ.605.74 కోట్లు కేటాయించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువకు అనుసంధానంగా నిర్మించే ఆ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మంది ప్రజలకు తాగు నీరు అందించాలన్నది లక్ష్యం. ఈ పథకానికి 2009లో శంకుస్థాపన చేసినప్పటికీ 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చే వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం మొదటి దశ పనులకు రూ.2,022 కోట్లతో టెండర్లు పిలిచింది. కశింకోట మండలంలో పనులు సైతం మొదలయ్యాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులు ఆపేసింది. 2020లో ఆర్భాటంగా రూ.17,028 కోట్లతో పరిపాలన పరమైన అనుమతులు ఇచ్చింది. కానీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. 2019-24 మధ్య ఏటా బడ్జెట్‌లో కేటాయింపులు చూపడం, నిధులు విడుదల చేయకపోవడం ఆనవాయితీగా మారింది. మొత్తం మీద వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా వుంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు గత ఏడాది ఎన్నికల ముందు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తొలి బడ్జెట్‌లోనే రూ.605.74 కోట్లు కేటాయించారు.



బడ్జెట్‌లో రూ.2 కోట్లు కేటాయించిన పెద్దేరు జలాశయం (ఫైల్ ఫొటో)

పలు రిజర్వాయర్‌కు నిర్వహణ నిధులు

జిల్లాలో తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ తదితర జలాశయాల నిర్వహణ పనులకు గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో నిధులు విడుదల చేయలేదు. కాలువల్లో పూడిక తీత, సిమెంట్ లైనింగ్, దెబ్బతిన్న గేట్లు, మదుముల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని ఏటా జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపడం, నాటి ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేయడం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆయా జలాశయాలకు నిర్వహణ పనుల నిమిత్తం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. పెద్దేరు జలాశయానికి రూ.2 కోట్లు, రైవాడకు రూ.77 లక్షలు, తాండవకు రూ.48.3 లక్షలు, కోనాం జలాశయానికి రూ.10.4 లక్షలు కేటాయించింది.

రాష్ట్ర పండుగగా నూకాలమ్మ జాతర?

- ఎమ్మెల్యే కొణతాల, ఎంపీ సీఎం రమేశ్ వినతితో సీఎం చంద్రబాబు సానుకూల స్పందన
- పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీఎంఓ నుంచి దేవదాయ శాఖ కార్యదర్శికి లేఖ

కొత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :



ఉగాది ముందు రోజు కొత్త అమావాస్య సందర్భంగా అనకాపల్లిలో జరగనున్న నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించేందుకు తగిన చర్య లు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సీఎంవో ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రనున ఆదేశించారు. దీంతో ఈ నెల 12న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇచ్చిన విజ్ఞాపన పత్రాన్ని పరిశీలించి, నియమ నిబంధనల మేరకు తగు నిర్ణయం తీసుకోవాలని ముద్దాడ రవిచంద్ర తాజాగా దేవదాయ శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పూర్తి చేసిన ఫైలును ముఖ్యమంత్రి లాగిన్‌కు పంపాలని ఆయన ఆదేశించారు.

పడకేసిన భవన నిర్మాణాలు

వైసీపీ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు

- 'పేట మండలంలో మొత్తం 64 భవనాలు.. పూర్తయినవి 11
- అద్దె భవనాల్లో అరకొర వసతితో ఉద్యోగులు, ప్రజల ఇక్కట్లు



పాయకరావుపేటలో శ్లాబ్ స్థాయిలో నిలిచిన సచివాలయం-5 భవన నిర్మాణం

పాయకరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. దీంతో ఆయా కార్యాలయాలను ఇరుకైన అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహించే ఉద్యోగులతోపాటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

గ్రామాల్లో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించడం కోసం 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకు వచ్చింది. తొలుత పంచాయతీ కార్యాలయాలు, ఇతర ప్రైవేటు భవనాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఇంకా రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను కూడా మంజూరు చేసింది. వీటికి సొంత భవనాల కోసం ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా పాయకరావుపేట మండలంలో 25 సచివాలయాలు, 19 రైతు భరోసా కేంద్రాలు, 20 వెల్‌నెస్ సెంటర్లు కలిపి మొత్తం 64 భవనాలు మంజూరుచేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మొదట్లో పనులు ఉత్సాహంగానే చేశారు. అయితే అప్పట్లోప్రభుత్వం తెచ్చిన నూతన ఇసుక పాలసీ కారణంగా పాయకరావుపేట మండలంలో ఇసుక కొరత ఏర్పడింది. అయినప్పటికీ కాంట్రాక్టర్లు ఇతర ప్రాంతాల్లో ఇసుకను అధిక ధరకు కొనుగోలుచేసిమరీ భవన నిర్మాణాలను కొనసాగించారు. మొదటి దశ పనులు ... మిగతా 8వ పేజీలో



నామవరంలో శ్లాబ్ స్థాయిలో నిలిచిపోయిన ఆర్‌బీకే భవన నిర్మాణం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు!

జిల్లాలో 34 కేంద్రాలు, 26,161 మంది విద్యార్థులు

- ఫస్టియర్ 12,936 మంది, సెకండియర్ 13,225 మంది
- ఒక్క నిమిషం ఆలస్యమైనా 'నో ఎంట్రీ'



సబ్బవరంలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేయిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ రామకృష్ణ

అనకాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 34 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నిర్ణీత తేదీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులను 30 నిమిషాల ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. సరిగ్గా తొమ్మిది గంటలకు గేట్లు మూసివేసారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. కాగా జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 26,161 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 12,936 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 13,225 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. కేంద్రాల్లో విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది కూడా సెల్‌ఫోన్‌లను పరీక్ష కేంద్రాల ప్రాంగణంలో వినియోగించకుండా ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసరు మాత్రమే ఇంటర్ బోర్డు అందించిన కీప్యాడ్ సెల్‌ఫోన్‌ను వినియోగించాలి.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ రాత పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు దృష్టి సారించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పోలీస్ అధికారులు నిర్వహించాల్సిన విధుల గురించి ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ... మిగతా 8వ పేజీలో

తాగునీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

- జిల్లా అధికారులకు సీఎస్ విజయానంద్ ఆదేశం
- అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్ని జిల్లా అధికారులను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి జిల్లాల అధికారులతో అమరావతి నంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అనకాపల్లి జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఒకటో తేదీ ఉదయం ఏడు గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని, తొలి రోజే శతశాతం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా పింఛన్‌దారుడు అందుబాటులో లేకపోతే మూడో తేదీన అందజేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వే మార్చి 15వ తేదీనాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

నేటి నుంచి ఎలమంచిలి మునిసిపాలిటీలో నిషేధం అమలు

- 120 మైక్రాన్‌లకన్నా తక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లు బ్యాన్
- జాబితాలో ప్లాస్టిక్ స్పూన్లు, ఫోర్క్‌లు, ఇయర్ బడ్స్, స్ట్రాలు, గ్లాసులు, థర్మోకోల్ ప్లేట్లు, కప్పులు
- నిబంధనలు అతిక్రమించే వ్యాపారులపై చర్యలు
- మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను శనివారం నుంచి పట్టణంలో అమలు చేయనున్నట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఆయన శుక్రవారం మార్కెట్ వద్ద వ్యాపారులతో సమావేశం నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ గురించి వివరించారు. మునిసిపాలిటీలో 120 మైక్రాన్‌లకన్నా తక్కువ మందం వున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, అమ్మకం, వినియోగంపై నిషేధాన్ని అమలు చేయనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతోపాటు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన స్పూన్లు, ఫోర్క్‌లు, ఇయర్ బడ్స్, స్ట్రాలు, గ్లాసులు, థర్మోకోల్ ప్లేట్లు, కప్పులను పూర్తిగా నిషేధించామన్నారు. రోడ్డు ... మిగతా 8వ పేజీలో



ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు

సూర్యనారాయణ స్వామి ఆలయంలో హోమం



ఆలయం ఆవరణలో హోం జరిపిస్తున్న అర్చకులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మాఘమాసం ముగుస్తున్న నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని గొల్లల కొండపై ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ హోమాన్ని జరిపారు. జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ దంపతులతో పాటు జనసేన నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు.

నూకాంబికా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపం గల నూకాంబికా అమ్మవారి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకున్నారు. మధ్యాహ్నా అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కర్రి ధనరెడ్డి, కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, గంధం శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామాలయంలో గోపూజ



గోవుకు ఆహారాన్ని తినిపిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన రామాలయం ఆవరణలో శుక్రవారం గోపూజా నిర్వహించారు వచ్చే నెలలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో ఇక్కడ వేడుకలు ప్రారంభమయ్యాయి. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ముఖ్య అతిథిగా హాజరై గోవుకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలోని పాఠశాలల్లో విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎన్ఎస్‌టీఎల్, బార్క్ శాస్త్రవేత్తలు

పాఠశాలల్లో ఘనంగా సైన్స్ డే

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టులు
- దిశా నిర్దేశం చేసిన అతిథులు



రాంబిల్లి హైస్కూల్‌లో...



ఎలమంచిలి : కొక్కిరాపల్లి పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన నమూనాలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శనివారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కొక్కిరాపల్లి ఎంపీయూపీ స్కూల్, జంపపాలెం పాఠశాలల్లో జరిగిన ఈ వేడుకల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు బీవీఎస్ సాయిబాబా, శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగితే విజయం తథ్యమన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించి ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో పాపాజీరావు, బొడ్డేటి సత్యనారాయణ తదితర ఉపాధ్యాయులతో పాటు యాజమాన్య కమిటీల ప్రతినిదులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం : సైన్స్ దినోత్సవం సందర్భంగా ఇక్కడి కైట్స్ విద్యావిహార్, భవానీ విద్యానికేతన్‌లలో ఏర్పాటైన వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. భవానీ విద్యానికేతన్‌లో ఏర్పాటైన వేడుకల్లో ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త యు.అర్బన్‌కుమార్, కైట్స్‌లో బార్క్ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనల ద్వారా సమాజం ఎంతో వృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో కూండ్రపు సంతోష్‌కుమార్, రెడ్డి గణేష్, కూండ్రపు మూర్తి ప్రసాద్, రెడ్డి చిరంజీవి, శ్రీలత, ధర్మిరెడ్డి శ్రీనివాసరావు, రామ్‌కుమార్, తమ్మిన అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి : మండల కేంద్రం రాంబిల్లి హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎం.వేణుగోపాల్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానంతో విద్యార్థులు ప్రగతి సాధించాలన్నారు. ప్రధానంగా శాస్త్రీయ దృక్పధాన్ని అలవర్చుకొని శాస్త్రీయ పరిశోధనారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు రూపొందించి ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రంగాల రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రసాయన వాడకం లేని పంటలు పండించాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



మునగపాకలో మాట్లాడుతున్న మోహన్‌రావు

మునగపాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రసాయన వాడకం లేని పంటలు పండించాలని, ఇటు వంటి గ్రామాన్ని గుర్తించాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు పిలుపు నిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశం లో మాట్లాడారు. కలెక్టర్ సూచనల మేరకు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి రసాయన ఎరువులు వాడకుండా పంటలు పండించే దిశగా చర్యలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సిహెచ్.లచ్చన్న, వెలుగు ఏపీఎం బాలరాజు ,మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ప్రకృతి వ్యవసాయ గ్రామంగా కొండకర్లను ఎంపిక చేశామని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి సీహెచ్.లచ్చన్న తెలిపారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండకర్లను దత్తత తీసుకుని ఎటువంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మంచి నేల తయారు చేయాలనే ఉద్దేశంతో ఈ గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, మండల వ్యవసాయాధికారి శంకర్ గోవింద్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రకృతి వ్యవ సాయం లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయాధికాణి సి.సుమంత అన్నారు. ఇక్కడ ప్రకృతి వ్యవసాయం చేసే గ్రామం ఎంపికకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎటువంటి రసాయనాలు లేకుండా సహజసిద్ధంగా లభ్యవయ్యే పశువుల ఎరువు, నాటు ఆవు మూత్రం, వేప, జిల్లేడు, తూటికాడ ఆకుల కషాయాలను ఉపయోగించి వందశాతం ప్రకృతి వ్యవసాయం చేస్తే పెట్టుబడి తక్కువతో పాటు ప్రజలకు ఇటువంటి పంటల వల్ల సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు.



ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

'టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి'

ఎలమంచిలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రడీమేడ్ రంగంతో పోటీపడి అవస్థల నడుమ జీవనాన్ని సాగిస్తున్న దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలు మంజూరు చేయాలని టైలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణ కోరారు. పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ టైలర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ది టైలర్స్ ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టైలరింగ్ వృత్తే జీవనాధారంగా మారిన తమలాంటి వారిని ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దర్జీ దుకాణాలకు రెండు వందల యూనిట్లు విద్యుత్‌ను సబ్సిడీపై ఇవ్వాలని, సొసైటీలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు దర్జీలంతా పీవీ కాంప్లెక్సు నుంచి ప్రధాన రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు మళ్ల శ్రీను, పిల్లా శివ, డి.శేషు, ఎం.నాగేశ్వరరావు, డి.సూరిబాబు, గిడుతూరి అప్పారావు, రైవాడ శంకరరావుతో పాటు మహిళా టైలర్లు పాల్గొన్నారు.

మునగపాక : ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడం వలన టైలర్ వృత్తిపై ఆధారపడి జీవనం సాగించడం కష్టంగా మారిందని వీరభద్ర టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల వెంకటరావు అన్నారు. మండలంలో గవర్ల అనకాపల్లిలో శుక్రవారం ప్రపంచ టైలర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులంతా వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. రడీమేడ్ కారణంగా రోజు రోజుకు వృత్తి దిగజారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ముందుకొచ్చి టైలర్లకు పింఛన్ పథకం ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట శివాజీ, అప్పికొండ శివ, కాండ్రేగుల వెంకటలక్ష్మి, పొలమరశెట్టి శారద, అంగులూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ 'భోజనం' నిర్వాహకులకు నోటీసులు



భోజనం పథకం నిర్వాహకులకు నోటీసు జారీ చేస్తున్న ప్రిన్సిపాల్

మునగపాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లి ఏపీమోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు సరిపడ వండకపోవడమే కాకుండా సరిగా ఉడకక పోవడంతో ప్రిన్సిపాల్ వీపీఎస్ శ్రీలక్ష్మి శుక్రవారం నిర్వాహక సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఎన్నిసార్లు హెచ్చరించినా తీరుమారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం తక్కువగా వండడంతో విద్యార్థులు అర్ధాకలితో వుండాల్సి వస్తు న్నదని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా వంట గదిలో బియ్యం వుండడాన్ని గుర్తించి, వారిపై మండిపడ్డారు.

నేడు సత్యవరంలో గౌరీశంకరుల తీర్థ మహోత్సవం



పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామంలో శనివారం గౌరీ శంకరుల తీర్థ మహోత్సవం జరగనున్నది. అనకాపల్లి గౌరీ శంకరుల జాతర మహోత్సవం తరువాత సత్యవరంలోనే అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు అనకాపల్లి, విశాఖ, తూర్పుగోదావరి, గుంటూరు తదితర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేసి గౌరీదేవి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ జాతర సుమారు 150 సంవత్సరాల నుంచి జరుపుకుంటున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. జాతర సందర్భంగా గ్రామంలోని వీదులన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలఉ ఏర్పాటు చేస్తున్నారు.

పాల్తేరులో ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని నిరసన

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తేరు గ్రామంలో సర్వే నంబరు 137లో ఆక్రమణలో ఉన్న పంచాయతీ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలని దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆక్రమణలో ఉన్న పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రజావసరాకోసం వినియోగించాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి తదితర అధికారులకు పిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నేలు నీలాపు సత్తిబాబు, దడాల చిన్న, వజ్రపు ఆనంద్, పులి రాజశేఖరం, పిరుమళ్ల సత్తిబాబు, నీలాపు చంటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడ్ ఆర్గనైజేషన్ సభ్యురాలు అమ్మాజీ మాట్లాడుతూ 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల పిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలా ఎవరైనా చేస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. బాల్య వివాహాలు వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని చెప్పారు. ఈ విషయాలను తల్లిదండ్రులు పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీసు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మకతే అసలైన సంపద

- డాక్టర్ విజయ్ విట్టల్ టి.మతాడ్
- నియోజకవర్గంలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పాయకరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతే విద్యార్థులకు అసలైన సంపద అని క్రామ్సస్ రీసెర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ విట్టల్ టి.మతాడ్ అన్నారు. శుక్రవారం శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ మతాడ్‌తో పాటు గౌరవ అతిథిగా ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీ.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సర్ సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలవేసిన అనంతరం జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం డాక్టర్ ముతాడ్ మాట్లాడుతూ విజయాన్ని పొందాలంటే ప్రతి ఒక్కరూ బుద్ధిబలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, వృద్ధి, చురుకుదనం, వాక్చాతుర్యం అనే ఎనిమిది అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. బట్టీపట్టే విధానం కాకుండా మేధోపరమైన చదువు ద్వారానే మంచి పురోగతి సాధించగలరన్నారు. సంపద సృష్టికి శాస్త్ర సాంకేతిక రంగాల పరిశోధనలు ఎంతో దోహదపడతాయని సర్ సీవీ.రామన్ ఆవిష్కరణలను ఉదహరిస్తూ తెలిపారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి హాజరైన సుమారు 300 మంది విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, క్విజ్, సైన్స్ ప్రాజెక్ట్‌లు తదితర అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు కె.నారేంద్ర బాబు, ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ వీవీఎస్‌టీ.బంగార్రాజు పాల్గొనారు.



ఎస్.రాయవరం: ఉప్పరాపల్లి పాఠశాలలో శాస్త్రవేత్తల చిత్రపటాల ప్రదర్శన



కోటవురట్ల విద్యార్థుల నమూనాలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్.. నక్కపల్లి విద్యార్థుల ప్రాజెక్టు

నక్కపల్లిలో...

నక్కపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్‌డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. శాస్త్రజ్ఞుల ఆవిష్కరణల గురించి చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివయ్య, బోటనీ లెక్చరర్ వరప్రసాద్, పెదబోదిగల్లం హైస్కూల్ హెచ్ఎం సిహెచ్.సత్యనారాయణ తదితరులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



శ్రీప్రకాష్ విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న ముతాడ్

కోటవురట్లలో...

కోటవురట్ల: మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్సు దినోత్సవ ఘనంగా జరిగింది. జల్లూరు, పాములవాక ఉన్నత పాఠశాలు, కొడవటిపూడి, రాజుపేట యూపీ పాఠశాలల్లో సైన్సు సంబందిత అంశాలపై చర్చాగోష్ఠి జరిగింది. కస్తూర్బాగాంధీ, కె.వెంకటాపురం, కోటవురట్ల పాఠశాలల్లో విద్యార్థులు ప్రదిర్శంచిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. హెచ్ఎంలు యేసుదాసు, ఏవీశ్రీనివాస్‌మూరి, సరితాదేవి, ఆర్.నాని, మణిమోహన్ సీవీ రామన్‌కు నివాళులర్పించారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ వేడుకలను ఆయా ఘనంగా నిర్వహించారు. ఉప్పరాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులంతా కలిసి శాస్త్రవేత్తల చిత్రపటాలను ప్రదర్శించారు. అనంతరం ఉపాధ్యాయులు సైన్స్ దినోత్సవం గురించి వివరించారు. హెచ్ఎం ఎం.పట్నాయక్, సైన్స్ ఉపాధ్యాయులు సంపత్, చక్రవర్తి, శ్రీను పాల్గొన్నారు

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



గుంటపల్లిలో ప్రజలకు నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారుచేసినా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు జి.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని గోపాలపట్నం, వెంకటనగరం, గుంటపల్లి, రాజవరం గ్రామాలలో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టరు పాకల అప్పారావు, ఎల్.అరుణకుమారి ఆధ్వర్యంలో నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ నవోదయం 2.0 బాగంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారా కేసులలో పట్టుబడితే మండల మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేస్తామని చెప్పారు. అలాగే లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని చెప్పారు. నాటుసారా వల్ల కలిగే నష్టాలు, పట్టుబడితే అమలయ్యే శిక్షలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది రమణ, కె.నాయుడుబాబు, సచివాలయ పోలీసు భవాని తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ టెస్టు విజేతలకు బహుమతులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోడల్ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అత్యుత్తమ మార్కులు సాధించిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఎస్ఐ సన్యాసిరావు, స్కూల్ హెచ్ఎం డీఎస్.భవానీ, కార్తికేయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవింద్ బహుమతులను పంపిణీ చేశారు. కొద్ది రోజుల్లో జరుగనున్న పదో పరీక్షల్లో కూడా ప్రతిభ కనబర్చి అత్యుత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ, నాయకులు సిద్ధుకృప, లక్ష్మణ్, రాము, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం

నక్కపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరమని ఏవో ఉమా ప్రసాద్ చెప్పారు. నక్కపల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఏపీ సీఎన్ ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యునిటీ మేనేజడ్ నేచురల్ ఫార్మింగ్) సమావేశం జరిగింది. ఆర్ఎస్‌కే సిబ్బంది, వెలుగు సీసీలు, ఇతర సిబ్బందికి సేంద్రియ సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృకి అనుగుణంగా వ్యవసాయం చేయడమే సహజ వ్యవసాయమని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

నక్కపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల రెసిడెన్షియల్ కళాశాలల్లో శనివారం ఉదయం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం శుక్రవారం జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, గురుకులం ప్రిన్సిపాల్ కె.సువర్ణ రత్నకుమారి సమీక్ష జరిపారు. ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్న ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి పలు సూచనలు చేశారు. జూనియర్ కళాశాలలో 446 మంది, గురుకులంలో 594 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని వారు చెప్పారు. పరీక్షల సమయంలో పాటించాల్సిన నిబంధనలను సిబ్బందికి వివరించారు.

పోలీసు స్టేషన్ భవన నిర్మాణంపై చర్చలు

నక్కపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో కొత్తగా నిర్మించనున్న పోలీసు స్టేషన్ భవనం పూర్తిగా వాస్తు ప్రకారం వుండాలని శుక్రవారం చర్చించారు. అలాగే భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని వాస్తు నిపుణులతో పరిశీలించారు. అనంతరం సీఐ కె.కుమారస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ వాస్తు నిపుణులతో మాట్లాడారు. పూర్తిగా వాస్తు ప్రకారం పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి ప్లానింగ్ ఇవ్వాలని సీఐ, టీడీపీ మండల అధ్యక్షుడు కోరారు. త్వరలో హోం మంత్రి అనిత కొత్త స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని వారు తెలిపారు.

భూమి కాలువపై 18 గేట్లకు మరమ్మతులు

- ఇరిగేషన్ డీఈ ఎస్.జగదీశ్వరరావు



భూమి ఆనకట్ట వద్ద గేట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ జగదీశ్వరరావు

పాయకరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరందిస్తున్న భూమి కాలువపై పాడైన 18 గేట్లు మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని జలవనరుల శాఖ పాయకరావుపేట డివిజన్ డీఈ ఎస్.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తాండవ నదిపై ఉన్న భూమి ఆనకట్ట వద్ద గేట్లతోపాటు పాయకరావుపేట నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు ప్రవహిస్తున్న భూమి పంటకాలువపై పలు చోట్ల పాడైన డివిజన్ డ్యామ్‌ల గేట్లను డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కాలువపై పాడైన 18 గేట్లను పునరుద్ధరించాలని నిర్ధారించామన్నారు. వీటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూపొందించిన అంచానలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిధులు మంజూరుకు కృషిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూమి కాలువ చైర్మన్ గెడ్డం చైతన్య, వైస్ చైర్మన్ నూకయ్యనాయుడుతోపాటు పలువురు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరపై సీఎం స్పందన పట్ల హర్షం



సీఎం కార్యాలయం నుంచి వచ్చిన పత్రాన్ని చూపుతున్న రాంకీ

కొత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నూకాంబిక జాతరపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల స్పందన పట్ల జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇక్కడ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ విలేకరులతో మాట్లాడుతూ నూకాంబిక జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరేలా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కృషి చేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారన్నారు. శుక్రవారం అసెంబ్లీలో చంద్రబాబును కలిసి ఈ విషయమై ప్రస్తావించారన్నారు. రాష్ట్ర పండుగకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్య కార్యదర్శికి సీఎం సూచించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, పీలా నాగశ్రీను, దూలం గోపీ, తాడి రామకృష్ణ, సత్యనారాయణ, నందారపు సూరిబాబు, ఉల్లింగల రమేష్, మళ్ల శ్రీను, అప్పికొండ గణేష్, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబిక, మల్లికార్జున ఆలయ వార్షికోత్సవం



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న గండి బాబ్జీ తదితరులు

సబ్బవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పెదనాయుడుపాలెం సమీపం గణపతిపురంలో భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలతో పాటు స్వామి, అమ్మవారి కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపారు. సాయంత్రం మేళతాళాల నడుమ ఆదిదంపతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు చేపట్టిన అనంతరం ఆలయ కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, వీకేపీసీపీఆర్ మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎంపీపీ గండి దేముడు, వైసీపీ నాయకుడు గండి రవికుమార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ లక్ష్మణ, కేవీ సత్యనారాయణ, ఎస్.నాగేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీస్ కానిస్టేబుళ్ల మెయిన్స్ టాలెంట్ టెస్టు రేపు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో రెండవ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు ఏపీ పోలీస్ కానిస్టేబుల్స్ మెయిన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం శ్రీధర్ సీసీత ఆధ్వర్యంలో జరుపుతున్నట్టు వివరించారు. ఇందులో పాల్గొనదలిచేవారు హెచ్‌టీటీపీఎస్:// ఫామ్స్.జీఎల్‌ఈ/యుక్యూటీజెఎఫ్ఎక్స్9ఎక్స్‌పీఈఎస్‌జెహెచ్ఎల్‌టెఓటీ6 లింకను క్లిక్ చేసి తమ పేర్లను ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 93266 88899 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

జూనియర్ కళాశాలకు రోటరీ క్లబ్ బెంచీలు వితరణ



కళాశాలకు వితరణగా బెంచీలు అందించిన రోటరీ గవర్నర్, సభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీవీఎంసీ హైస్కూల్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రోటరీ క్లబ్ శుక్రవారం 20 బెంచీలను వితరణగా అందజేసింది. కళాశాలలో విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవన్న విషయం తెలియడంతో రోటరీ గవర్నర్ డాక్టర్ మళ్ల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా వీటిని కళాశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సరిపల్లి రాజేష్, అనిల్‌తో పాటు రోటరీ ప్రతినిధులు రఘురాం జవహర్, రాజేశ్వరప్రసాద్, బుద్ద రమణాజీ, బుద్ద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఐటీఎస్, ట్రాయ్ జాయింట్ అడ్వయిజర్ రాజు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇక్కడి డైట్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఎస్, ట్రాయ్ జాయింట్ అడ్వయిజర్ వీఎస్ రాజు మాట్లాడుతూ టెలికాం రంగంలో సాధించిన అభివృద్ధి, వినియోగదారులకు అందిస్తున్న సేవలు తదితరాలపై అవగాహన కల్పించారు. ఐటీఎస్ డైరెక్టర్ జీవీ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, బేసిక్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.పవిత్ర, సి.ఉదయ్‌కుమార్, సీహెచ్.భిక్షమ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు చెల్లించాలి'



కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు సత్యనారాయణ

పరవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీల ఆరు వారాల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తానాం గ్రామంలో ఉపాధి కూలీలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. కూలీల వేతనాల చెల్లింపులో జాప్యం తగదన్నారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు పనిముట్లుకు కూడా డబ్బులు చెల్లించాలని కోరారు. మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు పని ప్రదేశంలో సిద్ధం చేయాలన్నారు. రోజుకు ఆరు వందల రూపాయలు వేతనం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మి, కనకం, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



గవరపాలెం మహిళా కళాశాలలో ప్రాజెక్టులు చూపుతున్న విద్యార్థినులు



ఏఎంఏఎల్ కళాశాలలో రామన్ చిత్రపటం వద్ద నివాళి



పరవాడ : వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

బాలల మేధస్సు భళా..

» విద్యాలయాల్లో ఘనంగా సైన్స్ దినోత్సవం » అద్భుత ప్రాజెక్టులను రూపొందించి ఔరా.. అనిపించిన విద్యార్థులు



మామిడిపాలెంలో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు నమూనాలతో ఉపాధ్యాయులు



సబ్బవరంలోని పాఠశాలలో ఎంఈవోకు ప్రాజెక్టు వివరిస్తున్న దృశ్యం



కశింకోటలోని డీపీఎన్ ప్రభుత్వ పాఠశాలలో..

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గవరపాలెం ఆదినారాయణ మహిళా కళాశాలలో కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ ఆధ్వర్యంలో డైరెక్టర్ అనూష సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఈ వేడుక జరిపారు. విద్యార్థులు అనేక ప్రాజెక్టులు తయారుచేసి, వాటి పనితీరును చక్కగా వివరించారు. రఘునాథ్ విద్యార్థినులను అభినందించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను తయారుచేసి తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు జి బ్రహ్మాజీ, సైన్స్ ఉపాధ్యాయులు సత్తిబాబు, వరహాలు, శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు. అలాగే మరిన్ని పాఠశాలల్లో ఈ వేడుకలన నిర్వహించారు.

కొత్తూరు : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను, ప్రతిభా పాటవాలను విద్యారులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, నమూనాల తయారీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల సూపరింటెండెంట్ పి.అనురాధ ఫిజిక్స్ హెడ్ టి.నిరంజన్‌కుమార్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మపాల : మామిడిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీధర్ మాట్లాడుతూ సైన్స్ ద్వారానే ప్రపంచ మానవాళి జీవితం సరళతరం అవుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రకృతిని పరీక్షించడం అంశంపై విన్యాసాలు చేశారు. విద్యార్థులు తయారుచేసిన ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అలాగే, హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట మండలంలో..

కశింకోట : మండల కేంద్రం కశింకోట డీపీఎన్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. వికసిత భారత్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, బిందు సేద్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి నమూనాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో కె.ఎస్.ఎన్.మూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఎంఈవోలు సురేష్, కె.ఎస్.ఎన్.మూర్తి, హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, డీఎస్‌వో డి.కాళిదాసు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పలు పాఠశాలల్లో ఈ వేడుకలు జరిపారు.

పరవాడ మండలంలో...

పరవాడ : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని వాడ చీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు అన్నారు. సైన్స్ దినోత్సవం సందరంగా పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, ఎం.ఇందిర, ఎస్.కూర్మారావు, ఎస్.సంజీవరావు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మరిన్ని పాఠశాలల్లో సైన్స్‌డేను నిర్వహించారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలోని పలు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. గుల్లేపల్లి అక్షర్ పబ్లిక్ స్కూల్, సబ్బవరం ఆర్కిడ్ స్కూల్‌లలో విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, ప్రిన్సిపాళ్లు బి.అప్పారావు, స్వామినాయుడు, ఉమామహేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, మరిన్ని పాఠశాలల్లో విద్యార్థులు అద్భుత ప్రాజెక్టులను ప్రదర్శించారు.

రబీలో ఆశాజనకంగా ఆరుతడి పంటల సాగు

» ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

తుమ్మపాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం కంటే అధికంగా ఆరుతడి పంటల సాగు జరిగిందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడి ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్‌లో విస్తారమైన వర్షాలు కురిసిన కారణంగా నేలలో తేమ వలన రబీ సీజన్‌లో మినుము, పెసర, నువ్వులు, వేరుశనగ పంటల సాగు అధికంగా సాగిందన్నారు. ఈ సీజన్‌లో అపరాలు, నువ్వులు, వేరుశనగ వంటి పంటల్లో ఆశించిన దిగుబడులు పొందవచ్చనని వివరించారు. మినుము, పెసర పంటలు కోత దశలో ఉన్నాయని చెప్పారు. నువ్వు పంట వివిధ దశల్లో ఉందన్నారు. వరి సాధారణ విస్తీర్ణంలో 47 శాతం వేశారన్నారు. అలాగే జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు మాట్లాడుతూ పెసర, మినుము పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు, అధిక ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక, పంటల సరళి మార్పు అనే అంశాల పై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవ్‌రెడ్డి, డాక్టర్ కె. తేజేశ్వరరావు, డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ సీహెచ్.శ్రీలత, డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ బి. ఉమా మహేశ్వరరావు, డాక్టర్ భవానీ పాల్గొన్నారు.

ఐదు రోజుల పని దినాల సాధనకు సిద్ధం కండి

» యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నాయకులు పిలుపు



స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి ఎదుట నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కొత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని దినాలు సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల ప్రతినిధులు పైలా ప్రసాదరావు, చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం అనకాపల్లి స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి వద్ద పలు స్లోగన్లతో బ్యానర్‌ను ఆవిష్కరించారు. మార్చి 24, 25 తేదీల్లో జరగనున్న నేషనల్ వైడ్ బ్యాంక్ ఉద్యమంలో భాగంగా అనకాపల్లిలో మద్దతు తెలుపుతూ కొవ్వొత్తులతో నినాదాలు చేశారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఐదు రోజుల పని దినం సాధించే దిశగా జాతీయ స్థాయి నాయకులంతా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు వారు తెలిపారు.

సబ్బవరంలో రెండు కేంద్రాల్లో
ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

» హాజరు కానున్న 1,064 మంది విద్యార్థులు

సబ్బవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభం కానున్న నేపథ్యంలో సబ్బవరంలోని కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తిచేశారు. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో పరీక్షలు జరగనున్నాయి. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫ్యాన్లు, బెంచీలు, లైట్లతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్లు పి.శుభాషిణి, ఎన్.రామకృష్ణ తెలిపారు. జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 323 మంది, ద్వితీయ సంవత్సరం 232 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. అలాగే, గురుకుల విద్యాలయంలో మొదటి సంవత్సరం 278 మంది, ద్వితీయ సంవత్సరం 231 మంది పరీక్షలకు హాజర కానున్నారు. శనివారం పరీక్షలు ప్రారంభమై మార్చి ఇరవయ్యో తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు ఉదయం ఎనిమిదిన్నర గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయా అధికారులు సూచించారు.

'పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత'

కొత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదానగర్ 11వ వీధి సాయిబాబా గుడి వెనుక వీధిలో ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి సుభాష్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు పందల శ్రీనివాస్, నీటిపల్లి రాజు, నాయకులు వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో ఆకట్టుకుంటున్న సెట్



అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నూకాంబిక మాలధారణ సంఘం వ్యవస్థాపకుడు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి సెట్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొత్త అమావాస్య జాతర సందర్భంగా నూకాంబిక మాలధారణ చేసిన భక్తులు పూజలు చేసుకోవడానికి ప్రత్యేకంగా సెట్ ఏర్పాటు చేశారు. అమ్మవారి భక్తుడు ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, సంతోషికుమారి దంపతుల ఆర్థిక సహాయంతో నాగలోకంలో ఆరుగురు అక్కాచెల్లెళ్లతో నూకాంబిక అమ్మవారు ఉన్నట్టు ఈ సెట్‌ను రూపొందించారు.

పైడిమాంబ ఘటాల ఊరేగింపు ప్రారంభం



అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పరవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో మార్చి తొమ్మిదో తేదీ నుంచి మూడు రోజుల పాటు పైడిమాంబ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి తొలి ఘటాల ఊరే గింపు గురువారం రాత్రి ప్రారంభమైంది. మేళతాళాల నడుమ అమ్మవారి ఘటాలను పెద్దింటి నుంచి తీసు కొచ్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పూజలు చేసి, కానుకలు సమర్పించారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



కమిటీకి నగదు అందిస్తున్న దాతలు

సబ్బవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో నిర్మిస్తున్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి స్థానికులు పండూరి చైతన్య, సత్యప్రసాద్ రూ.50.116లను శుక్రవారం విరాళంగా అందజేశారు. వీరిని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాగే శ్వరరావు, ప్రకాశ్, గెద్దం కృష్ణ, బర్ల రమణ, కోరాడ శ్రీను, ముర్రు కనకరాజు తదితరులు సత్కరించారు.

కూడళ్లలో గుంతలతో కష్టాలు

» ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు » పట్టించుకోని అధికారులు



పరవాడలోని బంగ్లా జంక్షన్, మండల పరిషత్ కార్యాలయ జంక్షన్ వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలు



పరవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ మండల పరిషత్ జంక్షన్, బంగ్లా జంక్షన్‌లలో రహదారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ జంక్షన్ల మీదుగా గాజువాక, సింధియా, విశాఖపట్నం, అచ్యుతాపురం, ఫార్మాసిటీ తదితర ప్రాంతాలకు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రయాణికులతో పాటు పరిశ్రమలకు యంత్ర సామగ్రిని తరలించే భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. కూడళ్ల వద్ద ఏర్పడిన గోతుల కారణంగా పరిస్థితి దారుణంగా తయారైంది. రాత్రి సమయంలో ఈ కూడళ్ల పైనుంచి ప్రయాణించాలంటే స్థానికులు హడలిపోతున్నారు. తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రెండు నెలల క్రితమే ఈ కూడళ్లలో రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇంతలోనే భారీ గుంతలు ఏర్పడడంతో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తీరుపై పలువురు మండి పడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే తొందరగా గుంతలు ఏర్పడ్డాయని ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కూడళ్ల వద్ద ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



పాడేరు:ఇన్విజిలేటర్స్‌తో మాట్లాడుతున్న చీఫ్ సూపరింటెండెంట్ రమాదేవి



అనంతగిరిలో పరీక్ష కేంద్రం

పాడేరురూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ సూపరింటెండెంట్ చీపురు రమాదేవి తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీఆర్, కేజీబీవీ కళాశాలల విద్యార్థులతోపాటు మదర్, మదర్ థెరీసా, విజేత, లక్ష్మీప్రశన్న, మోదమాంబ ప్రైవేటుకు చెందిన ఎనిమిది కళాశాలలకు చెందిన విద్యార్థులు 604 మంది పరీక్షలకు హాజరుకానున్నట్టు ఆమె తెలిపారు. పరీక్షల నిర్వాహణకు 26 తరగతి గదులను కేటాయించామన్నారు. ప్రతీ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు. వైద్య సిబ్బందిని నియమిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ నల్లా లక్ష్మణ కుమార్ పాల్గొన్నారు.

పాడేరురూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లు కృషి చేయాలని పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ చీపురు రమాదేవి కోరారు. ఈ నెల 1వ తేదీ శనివారం నుంచి 15వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల్లో పాల్గొనే ఇన్విజిలేటర్లతో శుక్రవారం కళాశాలలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పరీక్ష కేంద్రంలో 26 రూంలను పరీక్షలకు కేటాయించామన్నారు. ప్రతీ రూంలో సీసీ కెమెరాలు ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ నల్లా లక్ష్మణ కుమార్ పాల్గొన్నారు.

జి. మాడుగులలో ..

జి.మాడుగుల: ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు 436 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గౌరీప్రసాద్ తెలిపారు. తమ కళాశాలలో గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ నుంచి ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వివరించారు.

పెదబయలులో..

పెదబయలు: స్థానిక గురుకుల కళాశాలలో ఇంటర్ పరీక్షలకు మూడు కళాశాలల నుండి 509 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ప్రిన్సిపాల్ ఈశ్వరమ్మ తెలిపారు. గురుకుల కళాశాల నుంచి మొత్తం 376 మంది, కేజీబీవీలోని 80 మంది, జడ్పీ కళాశాల నుంచి 45 మంది రాయనున్నారని పేర్కొన్నారు. ఆదివారం ఫస్ట్ ఇయర్ 277 మంది హజరుకానున్నారని అన్నారు.వారికి 10 రూములు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శుక్రవారం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించినట్టు ఎస్‌ఐ కొల్లి రమణ తెలిపారు.

12 సీసీ కెమెరాలు ఏర్పాటు

అనంతగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళశాలలో ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 286 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రంలో 12 సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లుగా ప్రిన్సిపల్ ప్రమీల తెలిపారు. ఇతర అన్ని వసతులు కల్పించామని, తెలిపారు.

చింతపల్లిలో రెండు పరీక్ష కేంద్రాలు

చింతపల్లి: స్థానిక ఏపీ గురుకులం కళాశాలలో 446మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 261మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈపరీక్ష కేంద్రాల్లో మండలంలోని ఏపీ గురుకులం, ప్రభుత్వ జూనియర్, కస్తూర్బా, మదర్, అమరావతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ముంచంగిపుట్టు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రిన్సిపాల్ కొండన్నదొర అన్నారు. పరీక్షల గదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఏడాది మొదటి సంవత్సరంలో 288 మంది, ద్వితీయ సంవత్సరంలో 260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ప్రతీ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.



ముంచంగిపుట్టులో పరీక్షల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

ఈఎంఆర్ పాఠశాల ప్రవేశ పరీక్ష రేపు

చింతపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాల (ఈఎంఆర్‌ఎస్) ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్టు స్థానిక ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ తెలిపారు. ఆరో తరగతి, ఇతర తరగతుల్లో ప్రవేశాల కోసం పరీక్షలు రాసే విద్యార్థులు ఉదయం 11గంటలకు పాఠశాలకు హాజరుకావాలన్నారు. 11:30 నిమిషాలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్, గుర్తింపు కార్డు(ఆధార్), పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో రావాలన్నారు.



పాడేరులో విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను అందిస్తున్న డీఈవో



చింతపల్లి: విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఏసీ వినీత

సీవీ రామన్ స్ఫూర్తి ప్రదాత

» ఘనంగా సైన్స్ డే

పాడేరురూరల్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల ద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందని డీఈవో పి.బ్రహ్మాజీరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1928లో శాస్త్రవేత్త రామన్ కనుగొన్న రామన్ ప్రభావం (రామన్ ఎఫెక్ట్)కు గుర్తుగా ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నట్టు చెప్పారు.అనంతరం జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభను చూపిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్, కె.జె. రామారావు, పి.ప్రసాదరావు, రాజేష్, దిలీప్ కుమార్, అరుణ, కేశవరావు, మత్స్యకొండబాబు, గంగాభవాని, మహేశ్వరి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళాశాలలో సైన్స్ ఫోరమ్‌ను ప్రారంభించారు. క్విజ్, డిబెట్, పోస్టర్ తయారీ పోటీల్లో విజేతలకు బహుమతులందించారు. అధ్యాపకులు డి.గణేష్, సౌజన్య, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ హెచ్‌ఎం ప్రభుదాస్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవం పురస్కరించుకుని శాస్త్రవేత్త పీవి రామన్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు జె. బెనర్జీ, కె అపారావు రామన్ సేవలను వివరించారు. ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో సైన్స్‌డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ నేషనల్ సైన్స్ డే డాక్టర్ సీవీ.రామన్ రామన్ ఎఫెక్టైను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని నేషనల్ సైన్స్‌డే నిర్వహిస్తున్నామన్నారు. రామన్ పరిశోధనలు ఔషధ పరిశ్రమ, భూగర్భశాస్త్రం, పురావస్తుశాస్త్రం, ఫోరెన్సిక్ రంగాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను వీడి సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పీవీవీ ప్రసాద్, డీకేవీఎస్ ప్రణీత,సీహెచ్ మురళీకృష్ణకె. అఖిల్, కె.స్వర్ణలత వివిధ శాస్త్ర పరిశోధన అంశాలను వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి క్విజ్, వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



అరకులోయ: విజేతలకు బహుమతులందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి:సీఆర్‌పీఎఫ్ ఏసీ

చింతపల్లి: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని స్థానిక సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డి. వినీత అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో గణితం, సైన్స్, సోషల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు పలు ప్రయోగాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా వినీత మాట్లాడారు. ఎంఈవో పనసల ప్రసాద్, ప్రిన్సిపాల్ రేణు, కరస్పాండెంట్ కార్లీస్, ఎంఈవో-2 గెమ్మెలి బోడంనాయుడు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: స్థానిక శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రిన్సిపాల్ మత్స్యలింగం ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.



కొయ్యూరు: డోనూరులో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



మంప ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలో మంప, రేవళ్ల గ్రామ సచివాలయాల పరిధిలో అసంపూర్తిగా ఉన్న వివిధ నిర్మాణాలను పరిశీలించారు. ఘనవ్యర్థాల నుంచి సంపద సృష్టి కేంద్రాను ఎంపీడీవో పరిశీలించి పలు సూచనలు, సలహాలందించారు. ఈ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు వారం రోజుల వ్యవధిలో వినియోగంలోకి తేవాలని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం సచివాలయ రికార్డులు పరిశీలించారు. రేవళ్ల సచివాలయంలో సిబ్బంది హాజరు పరిశీలించారు. పలు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆ యన వెంట ఈవోపీఆర్‌డీ, సచివాలయఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బేబీ ఫీడింగ్ రూమ్స్



ఎంపీడీవో కార్యాలయంలో బేబీ ఫీడింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కొయ్యూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే బాలింతలు వారి పిల్లలకు తల్లిపాలు అందించేందుకు వీలుగా బేబీ ఫీడింగ్ రూంలను ఏర్పాటు చేసినట్టు ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలతోపాటు రాజేంద్రపాలెం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక రూంలను ప్రారంభించారు. ఆయా కార్యాలయాల అధికారుల చొరవతో ఈమేరకు గదులు కేటాయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్, తహసీల్దారు ఎస్‌ఎల్‌వీ ప్రసాద్, డీటీ కుమారస్వామి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్: సీపీఎం

పాడేరురూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. రూ. 40 వేల కోట్లు మాత్రమే ఉపాధి కల్పనకు కేటాయించడం నిరుద్యోగులకు అన్యాయం చేయడమే అన్నారు. రూ.3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదన్నారు. పైగా లక్షల కోట్లు అదనంగా అప్పు తేబోతున్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ: డీఈవో



ఇంటిలో విద్యార్థిని మేఘనతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. పాడేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అలాగే, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముగ్గు మేఘన, ఎస్‌కే సమీరా, వి.వెంకటమహేష్ ఇళ్లను శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో సందర్శించారు. విద్యార్థులు పరీక్షలకు ఏమేరకు సిద్ధమవుతున్నారో పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి ఇంగ్లీషు, సైన్స్, లెక్కల సబ్జెక్ట్‌లపై ప్రశ్నించారు. ఆయన సందర్శించిన సమయంలో విద్యార్థులు చదువుతుండడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు వన్నెతేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్శనలో ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్, డీఈవో కార్యాలయం నుంచి గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీవో) కరణం సూర్యకుమారి, లెక్కలు ఉపాధ్యాయులు దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు వితరణ



రగ్గులు అందిస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచి వైస్ చైర్మన్ సొనాయి గంగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కాడెలి పంచాయతీ తోటగున్నలు, సావిడిమామిడి, కప్పలోయ, కాడెలి, వర్తనాపల్లి గ్రామాల్లో 150 మంది పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పశు వ్యాధులను నియంత్రించాలి

» జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, తదితరులు

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల బారి నుంచి రక్షించే పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ అన్నారు. మార్చి 1 నుంచి 30 తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ పశువ్యాధి నియంత్రణ మాసోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆయన పశు సంవర్థక శాఖాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడారు. పశు సంపదకు వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలనే ఉద్దేశంతో ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళీ, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి సీహెచ్.నరసింహులు, పశువైద్యాధికారి రాజీవ్‌కిశోర్ పాల్గొన్నారు.

చదువులో రాణించాలి: సీఐ



అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి

అనంతగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలు అధిరోహించాలని అరకు సీఐ హిమగిరి సూచించారు. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు.. డ్రగ్స్ వద్ద బ్రో పేరిట శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బా లురు పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన భవిష్యత్తు మనచేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థి దశ నుం చే సన్మార్గంలోని నడవాలని కోరారు. బాగా చదివితే, చదువు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు పేరు వస్తుందని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఎస్‌ఐ డి.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య విద్యార్థుల సమస్యలపై వినతి

పాడేరురూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీవెంకటేశ్వర పశువైద్య విద్యార్థుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ విద్యార్థి సంఘ నేతలు జేసీ డాక్టర్ అభిషేక్ గౌడకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వర పశువైద్య విద్యాలయ అనుబంధ కళాశాలలైన తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి కళాశాలల విద్యార్థులు ఈ నెల 3వ తేదీ నుంచి తరగతులు బహిష్కరించి సమస్యలు పరిష్కారానికి సమ్మె చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు జి.ధనుష్, ఎస్.జగదీష్, పి.బాలు, లావణ్య శాంతి పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

జోలాపుట్టులో పారిశుధ్య లోపం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో పారిశుధ్య లోపంతో తాండవిస్తోంది. పలు వీధులు, రహదారుల పక్కన చెత్త పేరుకుపోతోంది. దీంతో దుర్గంధంతో స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి ఒడిశా వైపు వెళ్లే మార్గంలో అధికంగా చెత్త పేరుకుపోతోంది. ఈ స్థితిలో ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనచోదకులు, స్థానికులు వాపోతున్నారు. దీంతో పాటు దోమలు, ఈగలతో రాత్రి వేళల్లో నిద్ర కరువుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పలు వ్యాధుల బారిన పడుతున్నామని చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించేలా చూడాలని అభ్యర్థిస్తున్నారు.



రహదారి పక్కనే చేరుకున్న చెత్త

పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు

» ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ స్వామినాయుడు



మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ స్వామినాయుడు

చింతపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కృషి, పట్టుదల, ప్రణాళికతో చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ స్వామినాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని తాజంగి కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో సదుపాయాలు, విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పది, ఇంటర్ విద్యార్థినులకు బోధన చేశారు. విద్యార్థినులు ఒత్తిడికి గురికాకుండగా పరీక్షలకు సిద్ధపడాలన్నారు. గణితం, ఆంగ్లం, సైన్స్, సోషల్ పాఠ్యాంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థినులు అర్థంకాని విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇంటర్ విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు ఉపాధ్యాయులు తీసుకు వెళ్లి, పరీక్ష రాసిన తరువాత వసతి గృహనికి తీసుకు రావాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సుమమాధురి పాల్గొన్నారు.

ఆహార భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాలరావు

పాడేరురూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలల్లో పాడేరు డివిజన్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వంట కుక్‌లకు ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్‌పై అవగాహన, ఆహార భద్రతపై శనివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బి.వేణుగోపాలరావు తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ఈశిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శిక్షణలో పొందిన అంశాలను హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో, వంట కుక్‌లు చక్కగా వసతిగృహాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని తదితరులు పాల్గొన్నారు.

36వ రోజుకు చేరిన ఏకలవ్య పాఠశాల బాధితుల దీక్షలు



భూ దాతల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

దుంబ్రిగుడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి ఇచ్చిన భూ దాతలు ఉపాధి కల్పించాలని కోరుతూ చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 36వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యులు రాందాస్ మాట్లాడుతూ ఉపాధి కల్పిస్తామని హామీ మేరకుగిరిజనులు పాఠశాలకు భూములను ఇచ్చారని, తీరా పాఠశాల ప్రారంభించిన తర్వాత వేరే వ్యక్తులకు ఉద్యోగాలిచ్చి భూ దాతలను అధికారులు మోసగించారని వారు ఆరోపించారు. గిరిజనుల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఇన్ని రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఇకనైనా పాఠశాల భూ దాతలకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరుశురాం, క్రిష్ణ, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రంగురాళ్లు తవ్వితే కఠిన చర్యలు తప్పవు

» నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు

గొలుగొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): క్వారీల్లో రంగురాళ్ల తవ్వకాలు చేపట్టినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీని శుక్రవారం సీఐ రేవతమ్మ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యవతి, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్వారీలో భద్రతా చర్యల గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం గ్రామాల్లో ఉన్న రంగురాళ్ల క్వారీల్లో ఎటువంటి తవ్వకాలు చేపట్టినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పప్పుశెట్టిపాలెం గ్రామంలోని రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు జరుగుతున్నాయంటూ వచ్చిన వదంతులపై పరిశీలించడం జరిగిందన్నారు. ఆయా క్వారీల్లో నిరంతరం పోలీసులతో పెట్రోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, ఆర్ఐ కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

» మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సీతారామాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మండలంలోని శృంగవరం గ్రామంలో సీతారామాంజనేయస్వామి తీర్థ మహోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కోరారు. అనంతరం బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు



ఐతంపూడిలో సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురకలపూడి, బుచ్చెయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పి.రవికుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐతంపూడిలో జరుగుతున్న క్యాన్సర్ గుర్తింపు సర్వేను పరిశీలించి, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందించారు. తురకలపూడి పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్, మందులు, ఆపరేషన్ గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో వసతులు, ఆపరేషన్లపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుచ్చెయ్యపేట పీహెచ్‌సీని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై డాక్టర్‌ను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట, తురకలపూడి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం



గౌరీపరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న భక్తులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల కల్యాణం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయమంతా వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. ఉదయం తొమ్మిది గంటలకు గౌరీపరమేశ్వరుల కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం కోటపాడు పురవీధులలో బ్యాండ్ మేళాలతో గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గౌరీ పరమేశ్వరుల సేవా సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వయంభూ గౌరీశ్వరాలయంలో వసంతోత్సవం



నాగవల్లి వసంతోత్సవంలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

చోడవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో శుక్రవారం నాగవల్లి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అర్చకులు స్వామి దంపతులకు చక్ర స్నానం చేసిన అనంతరం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, అర్చకులు కె.చలపతి పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం స్వయంభూ నీలకంఠేశ్వరస్వామి, పోతులూరివీరబ్రహ్మేంద్రస్వామి, కొంగశింగి శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. ఏఎల్‌పురం, చోద్యం, పాత కృష్ణాదేవిపేట, నాగాపురం, కొంగసింగి, గొలుగొండ, రత్నంపేట, లింగంపేట తదితర గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

» పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
» ప్రతీ 30 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్
» మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు

ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. ప్రతీ 30 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించేందుకు ఎక్కడికక్కడ నిఘా నేత్రాలను అమర్చారు. అలాగే మాస్ కాపీయింగ్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా తగిన చర్యలు చేపట్టారు.

నర్సీపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నం నియోజకవర్గంలోని ఎనిమిది కేంద్రాల్లో శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల, ఏబీఎం, శ్రీప్రగతి, డాన్‌బాస్కో, మాకవరపాలెం, కృష్ణాదేవి పేట జూనియర్ కళాశాలలలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు. ప్రతీ 30 మందికి ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఇన్విజిలేటర్లు, విద్యార్థుల సెల్ ఫోన్ పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు సీసీ కెమెరాలతో పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గొలుగొండ గురుకుల, కస్తూర్బాగాంధీ విద్యాలయంతో పాటు ఎల్ఎన్ఎం నాయుడు ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన సుమారు 441 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 251 మంది కాగా, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 190 మంది ఉన్నారు. ఈ కేంద్రంలో పూర్తిస్థాయిలో ఫర్నిచర్‌తో పాటు తాగునీరు, మరుగుదొడ్ల సదపాయాలను అందుబాటులో ఉన్నాయి. పరీక్షా కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా 11 గదుల్లో సీసీ కెమెరాలు అమర్చారు. ఈ పరీక్షలకు డిపార్టుమెంటల్ అధికారిగా నర్సీపట్నం ప్రభుత్వ బాలుర కళాశాల అధ్యాపకుడు బీఎస్ఆర్ శర్మను నియమించారు. విద్యార్థులు అర్ధ గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని చీఫ్ సూపరింటెండెంట్ రుత్తల గంగరాజు తెలిపారు.

మాడుగులలో...

మాడుగుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రంలో మాడుగుల జూనియర్ కళాశాలతో పాటు సురవరం కేజీబీవీ, వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల, వడ్డాది గాయత్రి కళాశాలలకు చెందిన 500 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 14 తరగతి గదులను ఏర్పాటు చేశారు. తొలి రోజు పరక్షకు 17 మంది ఇన్విజిలేటర్లు ఉన్నారని, వారికి అదనంగా మరో నలుగుర్ని అందుబాటులో ఉంచామని పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.నీలిమ తెలిపారు. పరీక్షల్లో మాల్ కాపీయిం గ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలను అమర్చినట్టు ఆమె చెప్పారు.

రావికమతంలో...

రావికమతం: కొత్తకోట జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 470 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ కేంద్రంలో మరుపాక మోడల్‌స్కూల్, గర్నికం, రోలుగుంట కేజీబీవీ, కొత్తకోట, రోలుగుంట కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారని ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందుగానే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా బెంచీలు, ఫ్యాన్లు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించామన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అన్ని గదులు, కళాశాల వరండాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు.



నర్సీపట్నం జీజే కళాశాల పరీక్షా కేంద్రంలో బెంచీలపై నంబర్లు వేస్తున్న సిబ్బంది... (ఇన్‌సెట్‌లో) దేవరాపల్లి కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలో ఇంటర్ పరీక్షలకు 467 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చీఫ్ సూపరింటెండెంట్ నిర్మల తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 257 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 210 మంది పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కేజీబీవీ, తెనుగుపూడి గురుకుల కళాశాల, శారదా జూనియర్ కళాశాల విద్యార్థులు దేవరాపల్లి కేంద్రంలో పరీక్షలు రాస్తారన్నారు. వీరి కోసం పది గదులు ఏర్పాటు చేశామని, అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాలు అమర్చామని ఆమె తెలిపారు.

భూముల రీ సర్వే వేగవంతం చేయండి

» జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి

మాకవరపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు జాహ్నవి సూచించారు. మండలంలోని లచ్చన్నపాలెం, పైడిపాల గ్రామాల్లో రీసర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందితో ఆమె మాట్లాడుతూ మార్చి 15వ తేదీ నాటికి రీ సర్వే పూర్తిచేయాలన్నారు. అలాగే ప్రతీ రైతుకు సర్వేపై తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలన్నారు. లచ్చన్నపాలెం రెవెన్యూలో మూడు వేల ఎకరాల భూమిని సర్వే చేయాలన్నారు. సాగులో రైతు ఉన్నప్పటికీ టైటిల్‌డీడ్‌తో పాటు రికార్డులను పరిశీలించాలన్నారు. గతంలో మాదిరిగా సాగులో ఉంటే రైతును గుర్తించి మళ్లీ తప్పులు చేయవద్దని సర్వే సిబ్బందికి సూచించారు. ఇంతవరకు 500 ఎకరాల భూమిలో రీ సర్వే పూర్తయిందన్నారు. మరో రెండు టీమ్‌లు పెంచుకొని సర్వేను వేగవంతం చేయాలన్నారు. అలాగే 123 సర్వే నంబరులోని రైతులతో జేసీ మాట్లాడారు. గతంలో సర్వే చేసినా రికార్డులు సక్రమంగా లేవని, దీంతో రైతులు తమ అవసరాల కోసం భూములు అమ్ముకోలేని పరిస్థితి ఉందని ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు పోతల రాంబాబు చెప్పారు. ఇకపై రీ సర్వే పక్కాగా జరుగుతుందని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ, తహసీల్దార్ రామారావు, మండల సర్వేయర్ వేంకటేశ్వరావు పాల్గొన్నారు.



లచ్చన్నపాలెం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

రమణ హత్య కారకులను అరెస్టు చేయాలి

» పోలీసు స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా

దేవరాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు వారాది రమణ హత్యకు కారకులను తక్షణమే అరెస్టు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. రమణ హత్యకు తమ గ్రామానికి చెందిన హరి ప్రధాన కారకుడని, ఈ కేసులో హరిని పోలీసులు తప్పించే ప్రయత్నం చేస్తున్నారని మృతిని తల్లి చిన్నమ్మలు, భార్య కృష్ణవేణి ఆరోపించారు. రమణను పథకం ప్రకారం ఇద్దరు మహిళలతో కలిసి హరి హత్య చేయించాడని వారు పేర్కొన్నారు. ఈ కేసులో హరిని అరెస్టు చేసేవరకూ న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వారికి గ్రామంలో పలువురు మహిళలు మద్దతుగా నిలిచి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ విషయమై సీఐ పైడపునాయుడు మాట్లాడుతూ ఈ హత్య కేసులో హరికి సంబంధం ఉన్నట్టు ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభ్యం కాలేదని, కేసు విచారణ జరుగుతుందని, అతని ప్రమేయం ఉన్నట్టు ఆధారాలు లభ్యమైతే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, మహిళలు

పరీక్షల వేళకు బడి బస్సులు నడపాలి

నర్సీపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్, పదో తరగతి పరీక్షల కాల పట్టికకు అనుగుణంగా బడి బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిపో మేనేజర్ ఎంఎస్ఎస్.ధీరజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి పరీక్షలు రాయడానికి వచ్చే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలని కోరారు. తుని, చోడవరం, అడ్డరోడ్డు, అనకాపల్లి, చింతపల్లి, కృష్ణాదేవిపేట రూట్లలో పరీక్షలు రాయడానికి వస్తున్న విద్యార్థులు కనిపించిన వెంటనే బస్సు నిలిపివేసి ఎక్కించుకోవాలని ఆయన విన్నవించారు.

రీ సర్వేలో తప్పులు సవరించాలని నిరసన

గొలుగొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకలపాడు గ్రామ రెవెన్యూలో చేపట్టిన భూముల రీ సర్వేలో దొర్లిన తప్పులను సవరించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సర్వే నంబరు 272లో తమ పూర్వీకులకు ప్రభుత్వం డి.పట్టా మంజూరు చేసినట్టు రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీ సర్వేలో తమ భూమి వివరాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

వేతన బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల ఆందోళన

దేవరాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆరు వారాలుగా బకాయిపడ్డ ఉపాధి కూలిని వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బి.టి.దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గిరిజన కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గర్శింగి, చినగంగవరం, వేలంబయలు, సంతపాలెం, రేగులబంద గ్రామాల్లో ఉపాధి పథకంలో చేసిన పనులకు ఆరు వారాల నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. మండలంలో సుమారు రూ.కోటి వరకు బకాయలు ఉన్నాయని, పని చేసిన వారాలకు పే స్లిప్పులు ఇవ్వడం లేదని చెప్పారు. దీంతో కూలీలు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



వేతనాల కోసం పని ప్రదేశంలో నినాదాలు చేస్తున్న గిరిజనులు

ఉత్సాహంగా సైన్స్ డే..

» ఆకట్టుకున్న విద్యార్థుల ఆవిష్కరణలు



చోడవరం: నీటి వనరులు తక్కువగా వినియోగించేలా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు

నర్సీపట్నం/చోడవరం/రావికమతం/రోలుగుంట/బుచ్చెయ్యపేట/మాకవరపాలెం/నాతవరం/కె.కోటపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో శుక్రవారం సైన్స్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నర్సీపట్నం, చోడవరం నియోజకవర్గాల కేంద్రాలతో పాటు రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, మాకవరపాలెం, నాతవరం, కె.కోటపాడు మండలాల్లో విద్యా వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. తాగునీటి శుద్ధి యంత్రం, వాటర్ అర్వెస్ట్, మాడిఫైడ్ హౌస్, ఏరో రైల్, నీటి వనరులు తక్కువగా వినియోగించే నమూనాలు ఆకట్టుకున్నాయి. చోడవరంలోని శ్రీవిజ్ఞాన్ హైస్కూల్‌లో విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించి దాదాపు 600 ప్రాజెక్టులు తయారు చేశారు. వీటిలో పర్యావరణ పరిరక్షణకు ఉపకరించేలా సోలార్ పవర్‌తో రూపొందించిన పరికరాలు, టెక్నాలజీని ఉపయోగించి ప్రమాదంలో ఉన్నవారి సమాచారం తెలిపే చిప్ డిజైన్‌లతో పాటు, సైన్స్ ఆవిష్కరణలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రాజెక్టులు అదరహో అనిపించాయి. అలాగే చోడవరం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విద్యార్థులు 34 శాస్త్ర సాంకేతిక నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీవీరామన్ సేవలను అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. రావికమతం మండలంలోని చినపాచిల హైస్కూల్‌లో విద్యార్థులు 30 రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు, బోధకులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్ దినోత్సవం

నాతవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ప్రపంచ టైలర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటమ్మతల్లి టైలర్స్ సంఘం ప్రతినిధులు కేక్ కట్ చేశారు. రెడీమేడ్ వస్త్రాలు రావడంతో పనిలేక టైలర్లు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీనియర్ టైలర్ కె.సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో టైలర్లు పి.రాజు, కె.శివ, అంకంరెడ్డి పెదబాబు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలో టైలర్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి ఆనందంగా గడుపుకున్నారు. రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్స్ జీవన విధానంలో మార్పులు వచ్చాయని, ప్రభుత్వం దృష్టికి టైలర్ల సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరావు హామీ ఇచ్చారు. అనంతరం పలువురు టైలర్లను సత్కరించారు.

షుగర్ ఫ్యాక్టరీ దుస్థితిపై పోరాటాలకు సిద్ధం

» చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ

చోడవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీపై సర్కారు నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించి రైతులతో ఆయన మాట్లాడారు. ఐదు లక్షల టన్నులు ఆడే గోవాడ షుగర్ ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసి పూర్తిగా మూసివేసే కార్యక్రమానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు కనపడుతున్నదని విమర్శించారు. చెరకు రైతులకు బకాయిలు ఇవ్వకపోయినా, ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేస్తున్నప్పటికీ క్రషింగ్ చేయడంలో అధికారులు విఫలం కావడం సరికాదన్నారు. చెరకు రైతుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్, ఎండీలు స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కర్రి అప్పారావు, గండి నాయనబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రైపురం, ఆర్.శివరాంపురం సచివాలయాల్లో ప్రతి నెలా చివరి రెండు వారాలు ఆధార్ సేవలు అందిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి గుర్రం కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆధార్ కేంద్రంలో మొబైల్ నంబర్ లింకు, పుట్టిన తేదీ మార్పులు, బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ అప్పారావు, మహిళ పోలీస్ దివ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

నర్సీపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం సబ్ జైలును సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ శుక్రవారం సందర్శించారు. జైల్లో రిమాండ్ ఖైదీలతో మాట్లాడి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత కాలంగా రిమాండ్‌లో ఉంటున్నారని ప్రశ్నించారు. బెయిల్ పెట్టుకునే స్థోమత లేని వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం చేస్తామని ఆయన తెలిపారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలకు శుక్రవారం తెరపడింది. గిడుతూరు వరహానది తాగునీటి ప్రాజెక్టు ద్వారా సుమారు 15 గ్రామాలకు తాగునీరు అందుతుండగా, మూడు రోజుల క్రితం రాచపల్లి సెంటరు వద్ద పైపులైన్‌కు రంధ్రం పడింది. దీంతో ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ రంధ్రానికి మరమ్మతులు చేయడంతో శనివారం ఉదయం నుంచి యథావిధిగా తాగునీరు అందిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శివారెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోలు పునఃప్రారంభించాలి

నాతవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పౌర సరఫరాల శాఖాధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు పునఃప్రారంభించాలని వైసీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు బండి గంగరాజు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని ఫిబ్రవరి మూడో తేదీ నుంచి అధికారులు కొనుగోలు ప్రక్రియ నిలిపివేశారన్నారు. దీంతో రైతులు దళారులకు తక్కువ రేటుకు ధాన్యం అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఇంకా 50 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, అందువల్ల వెంటనే కొనుగోలు ప్రక్రియను పునఃప్రారంభించాలని ఆయన కోరారు.

ధారమఠం ఆలయ హుండీ ఆదాయం రూ.2.69 లక్షలు

గొలుగొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఉమాధారమల్లేశ్వరస్వామి ఆలయానికి హుండీ ఆదాయం రూ.2.68 లక్షలు వచ్చినట్టు దేవదాయ శాఖాధికారులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీని లెక్కించినట్టు చెప్పారు. కార్యక్రమంలో దేవదాయ శాఖాధికారి దివ్యతేజ, ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరునాళ్ల బందోబస్తుపై డీఎస్పీ ప్రశంసలు

రావికమతం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కల్యాణపులోవ ఉత్సవాల్లో ఎటువంటి అపశ్రుతి లేకుండా బందోబస్తు నిర్వహించిన కొత్తకోట సీఐ జి.కోటేశ్వరావును అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ప్రశంసించారు. ఈ ఉత్సవాలకు సుమారు రెండున్నర లక్షల మందికిపైగా భక్తులు రాగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారని సీఐను డీఎస్పీ అభినందించారు.

ఇది పార్కు కాదు.. పోలీస్ స్టేషన్!

పరవాడలో నందనవనాన్ని తలపిస్తున్న ప్రాంగణం

- వివిధ పూలు, పండ్ల మొక్కల పెంపకం
- ఆహ్లాదకరంగా వాతావరణం
- ఆశ్చర్యపోతున్న పోలీసు ఉన్నతాధికారులు
- సిబ్బందికి ప్రశంసలతో ప్రోత్సాహం


పార్కులో వివిధ రకాల పూల మొక్కలు


పోలీసు స్టేషన్ ఎదుట తీర్చిదిద్దిన పార్కు

పరవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

అదో నందనవనం. లోపలికి వెళితే ఏదో తెలియని అనుభూతికి లోనవుతాం. పార్కును తలపించేలా వివిధ రకాలకు చెందిన పూలు, పండ్ల జాతి మొక్కలు. కాసేపు వాతావరణం ఆహ్లాదకరంగా వుంటుంది. అక్కడ సేద తీరి వెళ్లాలనిపించేలా ఉంటుంది. ఇది పబ్లిక్ పార్కు కాదు.. పరవాడ పోలీస్ స్టేషన్ ప్రాంగణం. అటుగా రాకపోకలు సాగించే వారి దృష్టి తప్పకుండా దీనిపై పడుతుందనడం అతిశయోక్తి కాదు.



పరవాడ పోలీస్ స్టేషన్

పరవాడ పోలీస్ స్టేషన్ ప్రాంగణం పార్కును తలపించేలా ఉంది. చుట్టూ వివిధ రకాల పూలు, క్రోటన్స్ మొక్కలు, పండ్ల జాతికి చెందిన జామ, సపోట, అరటి, దానిమ్మ, దబ్బ, మామిడి, అనాసతోపాటు బాదం, ఉసిరి వంటి చెట్లను పెంచుతున్నారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన పైడపునాయుడు సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో రకరకాల మొక్కలను తీసుకొచ్చి ఇక్కడ నాటారు. వాటి సంరక్షణకు ఒక వ్యక్తిని నియమించి పార్కులా తయారు చేశారు. రోజూ ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోయడంతోపాటు 15 రోజులకొకసారి గడ్డి మొక్కలను తొలగిస్తున్నారు. ఖాళీగా వున్న సమయంలో పోలీసు సిబ్బంది కూడా ఈ పార్కులో శ్రమదానం చేస్తున్నారు.

వివిధ పనులపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారు ఈ ప్రాంగణాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. పోలీస్ స్టేషన్ వచ్చామా లేక పార్కుకు వచ్చామా అన్న సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌లో పనిపూర్తయిన తరువాత కొద్దిసేపు పార్కులో సేదతీరి వెళుతున్నారు. దీంతో పరవాడ పోలీసు స్టేషన్ జిల్లాలోని ఇతర పోలీసు స్టేషన్లకు ఆదర్శంగా నిలుస్తున్నది. స్టేషన్ సందర్శనకు వచ్చే ఉన్నతాధికారులు పచ్చదనం ఉట్టిపడుతున్న ప్రాంగణాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేయడంతోపాటు సిబ్బందిని మెచుకుంటున్నారు. పార్కును మరింత అభివృద్ధి చేసుకోండి అంటూ ఉత్సాహాన్ని నింపుతున్నారు..

చాలా ప్రశాంతంగా ఉంటుంది



స్టేషన్ ప్రాంగణంలో గడపడం చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ మొక్కలు, చెట్లను సంరక్షించడానికి ఒక వ్యక్తిని నియమించాం. నీరు పెట్టడం, కలుపు తీయడం, ట్రిమ్మింగ్ చేయడం వంటి పనులు చేస్తుంటాడు. స్టేషన్‌కు వచ్చే వారు ప్రాంగణాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో ప్రాంగణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం. **- ఆర్.మల్లికార్జునరావు, సీఐ**


స్టేషన్ ఆవరణలో వివిధ రకాల పండ్ల జాతి మొక్కలు, చెట్లు

నూకాలమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

- సీఎం చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే కొణతాల, ఎంపీ సీఎం రమేశ్ వినతి

కొత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల, ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని స్థానిక ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం.. వెంటనే తన వ్యక్తిగత కార్యదర్శి రవిచంద్రను పిలిచి నూకాలమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రకటనను విడుదల చేశారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి, నూకాంబిక జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని కోరామని, దీంతో ఆయన ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినందుకు కొణతాల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లారీ డ్రైవర్ హత్య కేసులో వీడిన మిస్టరీ

- ఇద్దరు మహిళల అరెస్టు
- సీఐ పైడపునాయుడు వెల్లడి


మీడియా సమావేశంలో సీఐ, ఎస్ఐలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైవాడకు చెందిన లారీ డ్రైవర్ వారాది రమణ (36)ను ఇద్దరు మహిళలు హతమార్చినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన కేసును హత్య కేసుగా మార్చినట్టు కె.కోటపాడు సీఐ పైడపునాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులకు తెలిపారు. రైవాడకు చెందిన లారీ డ్రైవరు రమణకు అదే గ్రామానికి చెందిన ఒక మహిళతో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. మద్యం అలవాటు ఉన్న రమణ తరచూ ఆమెతో గొడవ పడేవాడు. ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం మద్యం సేవించి ఆమెతో గొడవ పడ్డాడు. ఇద్దరూ కొట్టుకోవడంతో గ్రామస్థులతోపాటు ఆమె మేనల్లుడు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అయితే ఆ మహిళ ఈ విషయాన్ని ఎస్.కోటలో ఉన్న తన అక్క కుమార్తెకి చెప్పి, అదేరోజు సాయంత్రానికి రైవాడలోని తన ఇంటికి రప్పించింది. మద్యం మత్తులో ఉన్న రమణ అదే రోజు రాత్రి మరోసారి గొడవ పడి ఆమెను కర్రతో కొట్టి తన ఇంటికి వెళ్లిపోయాడు. తరువాత ఆ ఇద్దరు మహిళలు రాత్రి 11 నుంచి 12 గంటల మధ్యలో రమణ ఇంటికి వెళ్లారు. మద్యం మత్తులో నిద్రిస్తున్న అతని తలపై కర్రతో బలంగా కొట్టారు. రమణ కేకలు పెట్టడంతో పక్కన ఉన్న తలగడను ముఖంపై అదిమి పట్టుకొని ఊపిరి ఆడకుండా చేశారు. చనిపోయినట్టు నిర్ధారణ అయిన తరువాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. రమణ తల్లి చిన్నమ్మలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు సీఐ పైడపునాయుడు తెలిపారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో వారిని శుక్రవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ టి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కిడ్నీ ఇప్పిస్తామంటూ...

- లక్ష రూపాయలు కొట్టేసిన నకిలీ వైద్యులు!

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ ఇప్పిస్తామంటూ నకిలీ వైద్యులు లక్ష రూపాయలు తీసుకుని ఉడాయించారు. ఈ విషయమై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉప్పరపేట గ్రామానికి దూసి రాంజీకి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్న కుమారుడు మోక్షిత్ రామ్ (5) కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. చికిత్స కోసం అందినకాడికి రాంజీ అప్పులు చేశారు. బాలుడి ఆరోగ్యం మరింత క్షీణించడంతో కిడ్నీ మార్పిడి చికిత్సకు అవసరమైన సహాయం చేయాలని దాతలను కోరుతూ ఒక దినపత్రికలో ప్రకటన ఇచ్చారు. ఆ మరుసటిరోజు రాంజీకి ఒక ఫోన్ వచ్చింది. తాను కేజీహెచ్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నానని, తన పేరు నరసింహం అంటూ ఆ వ్యక్తి చెప్పాడు. కిడ్నీ ఏర్పాటుచేస్తానన్నాడు. బాలుడి తండ్రి రాంజీ వెంటనే కేజీహెచ్‌కు వెళ్లి ఫోన్ చేయగా...తన అసిస్టెంట్‌ను పంపిస్తున్నానని, అతడిని కలవాలని సూచించాడు. రాంజీని తెల్ల కోటు వేసుకున్న ఓ వ్యక్తి వచ్చి తన పేరు డాక్టర్ ప్రవీణ్‌గా పరిచయం చేసుకున్నాడు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణ వద్దకు తీసుకువెళ్లి, అక్కడ నుంచి ఆస్పత్రిలోకి వెళ్లి వచ్చి సాయంత్రానికి లక్ష రూపాయలు సిద్ధం చేసుకోవాల్సిందిగా చెప్పాడు. కేజీహెచ్‌లోనే కిడ్నీ డోనర్ ఉన్నారన్నాడు. బాలుడి తల్లి తన ఒంటి మీద ఉన్న వస్తువులను అమ్మింది. మరుసటిరోజుకు లక్ష రూపాయలు తీసుకువెళ్లారు. నరసింహానికి ఫోన్ చేయగా ఆ డబ్బును పిల్లల వార్డు వద్ద ఉన్న తన కారు డ్రైవర్‌కు ఇవ్వాలని చెప్పాడు. రాంజీ వాళ్లు చెప్పిన విధంగానే డబ్బును ఇచ్చేశాడు. డబ్బులు తీసుకున్న ప్పటి నుంచి ముగ్గురి జాడ లేదు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో కేజీహెచ్‌లో సంబంధిత విభాగాలలో వైద్యులను సంప్రతించగా అటువంటివారు ఎవరూ లేరని తెలిపారు. దీంతో తమ నుంచి లక్ష రూపాయలు కాజేసింది నకిలీ డాక్టర్లుగా గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

సంక్షేమ బడ్జెట్

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం దీనిని వంద శాతం పెంచింది. దీనివల్ల జిల్లాలో సుమారు రెండున్నర వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరనున్నది.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు

ప్రభుత్వ పాఠశాలలకు మేలు చేసే నిర్ణయం బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యుత్ బిల్లును ప్రభుత్వమే భరిస్తుందని, ఆ భారం తగ్గించేస్తామని వెల్లడించింది. అనకాపల్లి జిల్లాలో 1,407 ప్రభుత్వ పాఠశాలలు వున్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 1,033, యూపీ స్కూళ్లు 148, ఉన్నత పాఠశాలలు 226 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాల అయితే నెలకు సగటున రూ.500, ఉన్నత పాఠశాల రూ.2,500 వరకు బిల్లు వస్తుంది. ఆ భారం ఇక తప్పినట్టే. కొన్ని పాఠశాలలకు లక్ష రూపాయల బకాయిలు ఉన్నాయి. వాటిని కూడా రద్దు చేసే అవకాశం ఉంది.

ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

పక్కన చిరువ్యాపారుల నుంచి పెద్ద దుకాణాల వరకు... ప్రధానంగా చికెన్, మటన్, చేపల వ్యాపారులు, హోటళ్లు, కిరాణా వర్తకులు, టీ దుకాణాల నిర్వాహకులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల అమ్మకం, వినియోగం చేయవద్దని ఆయన సూచించారు. తమ ఆదేశాలను, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే జరిమానా విధించడంతోపాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పట్టణంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలుకు వ్యాపారులతోపాటు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

ఆర్టీసీకి మహాశివరాత్రి ఆదాయం రూ.6.41 లక్షలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపినందుకు అనకాపల్లి ఆర్టీసీ డిపోకు రూ.6.41 లక్షల ఆదాయం లభించిందని డిపో ఇన్‌చార్జి మేనేజర్ రవిచంద్ర చెప్పారు. కల్యాణపులోవకు 33 బస్సులు, ఎస్.కోట సమీపంలోని పుణ్యగిరికి ఎనిమిది బస్సులు నడిపినట్టు పేర్కొన్నారు ఈ సర్వీసులకు 99 శాతం ఓఆర్ వచ్చిందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 92.45 శాతం ఓటింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ప్రిసైడింగ్ అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం 92.45 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,794 మంది (92.45శాతం) ఓటు వేశారు. పురుషులు 13,508 మందికి 12,576మంది, మహిళలు 8,985కి 8,216 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆర్వో, విశాఖపట్నం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు!

... 5వ పేజీ తరువాయి

తెలియజేశారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అంతా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యార్థులను సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలతో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉన్న జెరాక్స్ షాపులను మూసివేయించాలన్నారు.

పడకేసిన భవన నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

పూర్తయిన తరువాత బిల్లులు అప్‌లోడ్ చేయగా, ప్రభుత్వం నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేసింది. ఇదే సమయంలో మార్కెట్‌లో సిమెంట్, ఐరన్ ధరలు పెరిగిపోయాయి. ఇటు చేసిన పనులకు బిల్లులు రాకపోవడం, అటు భవన నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో గిట్టుబాటు కాదంటూ చాలా చోట్ల కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం గద్దెదిగే నాటికి మండలంలో ఐదు సచివాలయాల భవనాలు, నాలుగు ఆర్‌ఎస్‌కే భవనాలు, రెండు వెల్‌నెస్ సెంటర్ల భవనాలు మాత్రమే పూర్తయ్యాయి.

పాయకరావుపేట పట్టణంలో ఐదు గ్రామ సచివాలయాలు వున్నాయి. మండల కాంప్లెక్స్ ఆవరణలో సచివాలయం-5 మినహా మిగిలిన నాలుగు సచివాలయాల భవన నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ సచివాలయాలను సుమారు నాలుగున్నరేళ్ల నుంచి అద్దె భవనాల్లోని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. కార్యాలయాలకు పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కేజీహెచ్‌లో గాడితప్పిన గైనకాలజీ వార్డు

- విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం
- గర్భిణులు, బాలింతల బంధువుల నుంచి వసూళ్లు
- మగబిడ్డ పుడితే రూ.3 వేలు, ఆడ బిడ్డ అయితే రూ.1,500
- ఇవ్వకుంటే చుక్కలు చూపిస్తారు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇటీవల శిశువుల మార్పు
- విభాగం ప్రక్షాళనతోనే మెరుగైన సేవలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

కేజీహెచ్ గైనకాలజీ వార్డు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడమే గాకుండా...గర్భిణులు, బాలింతల బంధువుల నుంచి డబ్బులు వసూలు చేస్తుంటారు. సిబ్బంది తీరుపై పదేపదే ఫిర్యాదులు వస్తున్నా అధికారులు మాత్రం పట్టనట్టు ఊరుకుంటున్నారు. తాజాగా వార్డులో శిశువులు మారిపోవడం సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు.

ఏం జరిగిందంటే...

అనకాపల్లి జిల్లా పరవాడ, కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు గర్భిణులు కొద్దిరోజుల కిందట గైనకాలజీ వార్డులో చేరారు. వీరిద్దరికీ నొప్పులు రావడంతో బుధవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ప్రసూతి విభాగంలోని లేబర్ రూమ్‌కు తీసుకువెళ్లారు. వేర్వేరుగా ట్యాగ్‌లు అమర్చారు. కృష్ణా జిల్లాకు చెందిన మహిళ పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉండడంతో 7.30 గంటలకు సిజేరియన్ చేశారు. ఆమెకు మగ బిడ్డ జన్మించాడు. శిశువును తల్లికి చూపించారు. ఫొటో కూడా తీశారు. అయితే శిశువును కృష్ణా జిల్లాకు చెందిన బాలింత కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సి ఉండగా, నిర్లక్ష్యంతో పరవాడకు చెందిన గర్భిణి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ తరువాత కొద్ది నిమిషాలకు పరవాడకు చెందిన మహిళకు ప్రసవం పూర్తయింది. ఆమెకు ఆడ బిడ్డ జన్మించింది. ఆడ శిశువును కృష్ణా జిల్లాకు చెందిన గర్భిణి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. మగ బిడ్డ పుట్టినట్టు చెప్పిన సిబ్బంది ఆడ శిశువును చేతిలో పెట్టడంతో కృష్ణా జిల్లాకు చెందిన మహిళ కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారంతా బయటకు వచ్చి ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో సూపరింటెండెంట్ వచ్చి సీసీ కెమెరాలు, ఫొటోలను చూపించి ఇరు వర్గాలను ఒప్పించి ఎవరి బిడ్డను వారికి అప్పగించారు. అయితే, ఇది పొరపాటున జరిగిందా?, ఇంకేమైనా కారణాలు ఉన్నాయా?...అన్న దానిపై విచారణ జరిపేందుకు సూపరింటెండెంట్ కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ టీవీ రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ వాసవీలత, డాక్టర్ సంధ్యాదేవి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మలతో కమిటీ ఏర్పాటుచేశారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించనుంది.


ఇప్పటికీ వసూళ్ల పర్వం

ఈ విభాగంలో సిబ్బంది అబ్బాయి పుడితే రూ.3 వేలు, అమ్మాయి పుడితే వేయి నుంచి రూ.1500 వరకూ వసూలు చేస్తుంటారు. ఈ మొత్తాన్ని లేబర్ రూమ్‌లో పనిచేసే సిబ్బంది పంచుకుంటారు. ఆర్థికంగా ఎవరైనా ఇవ్వలేని స్థితిలో ఉంటే చుక్కలు చూపిస్తారు. వసూళ్లపై అధికారులకు ఎంతోమంది బాధితులు ఫిర్యాదుచేశారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక గర్భిణులు, బాలింతలు, వారి బంధువులు పట్ల ఆయాలు, వార్డు బాయ్‌లు వ్యవహరించే తీరు అత్యంత దారుణంగా ఉంటుంది. ఇష్టానుసారంగా మాట్లాడుతుంటారు. ఇప్పటికైనా ఈ విభాగం ప్రక్షాళనపై అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- నర్సీపట్నంలో అదుపు తప్పిన ఆయిల్ ట్యాంకర్
- తొలుత గూడ్స్ ఆటోను, తరువాత స్కూల్ బస్సును ఢీకొన్న ట్యాంకర్
- కలాసీలు, పాస్టర్‌కు గాయాలు




ఘటనా స్థలంలో స్కూల్ బస్సు, ఆటో, ఆయిల్ ట్యాంకర్. (ఇన్‌సెట్‌లో) గాయపడిన మోతినాయుడు

నర్సీపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని సుబ్బారాయుడుపాలెం కూడలిలో శుక్రవారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. 40 మంది విద్యార్థులతో ఆగి ఉన్న ప్రైవేటు స్కూల్ బస్సుని, సిమెంట్ రవాణా చేసే ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

నర్సీపట్నంలో ఒక ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు 40 మంది విద్యార్థులు, ఒక టీచర్‌తో శుక్రవారం సాయంత్రం మాకవరపాలెం బయలుదేరింది. సుబ్బారాయుడుపాలెం కూడలిలో పిల్లలను దించడానికి డ్రైవర్ బస్సు ఆపాడు. ఇదే సమయంలో గూడ్స్ ఆటో రోలుగుంట వైపు నుంచి వస్తున్నది. ఈ క్రమంలో విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. తర్వాత స్కూల్ బస్సుని ఢీకొట్టి ఆగింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో వున్న కలాసీలు యాదగిరి అప్పారావు, రొంగలి లక్ష్మణరావు, సుంకర కృపారావు, ఆటో డ్రైవర్ మర్రి భాస్కరరావు గాయపడ్డారు. బస్సులో వున్న విద్యార్థులెవరూ గాయపడలేదు. కాగా రోలుగుంట మండలం జానకిరామపురానికి చెందిన పాస్టర్ ఆదపురెడ్డి మోతినాయుడు విశాఖలో ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు సుబ్బారాయుడుపాలెం కూడలిలో బస్సు దిగాడు. అక్కడే ప్రమాదం జరగడంతో స్కూల్ బస్సు కిందకు వెళ్లిపోయి స్పృహ కోల్పోయాడు. ఇతనిని బయటకు తీసి ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలించారు.

ముగిసిన కల్యాణపులోవ ఉత్సవాలు

- హుండీలు, ఇతర ఆదాయం రూ.16.03 లక్షలు


హుండీల కానుకలు లెక్కిస్తున్న శ్రీవారి భక్తులు

రావికమతం,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26 మూడు రోజులపాటు జాతర నిర్వహించారు. సుమారు రెండున్నర లక్షల మంది భక్తులు వచ్చినట్టు ఎండోమెంట్ అధికారుల అంచనా. శుక్రవారం ఆలయం వద్ద హుండీల కానుకలు లెక్కించారు. భక్తులు వేసిన కానుకల ద్వారా రూ.8,04,351 ఆదాయం లభించగా.. లడ్డూ, పులిహోర, స్పెషల్ దర్శనాలు, తలనీలాలు, కొబ్బరి చిప్పల వేలం ద్వారా రూ.7,99,420 ఆదాయం వచ్చింది. మొత్తంగా రూ.16,03,171 ఆదాయం వచ్చిందని ఈవో ఆశాకిరణ్మయి తెలిపారు. గతేడాది కంటే ఈఏడాది రూ.65,840 ఆదాయం తగ్గిందని ఆమె తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతరావు, వీఆర్వో, కార్యదర్శి, పోలీసులు, గిరిజన పెద్దల సమక్షంలో హుండీల లెక్కింపు జరిగిందన్నారు.